సాక్షి
వికారాబాద్
శుక్రవారం ׀ 6 ׀ జనవరి ׀ 2023



సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. 10లో▸



విదేశీ బృందం పర్యటన
అమెరికాకు చెందిన విస్కిన్ సన్ యూనివర్సిటీ శిక్షణ వైద్య బృందం గురువారం ధారూరులో పర్యటించింది. 10లో▸



బడులకు కొత్త సొబగులు
సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న సర్కారు బడులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. 11లో▸

న్యూస్‌రీల్

బూస్టర్ డోస్ తప్పనిసరి



బూస్టర్ డోస్ వేయించుకుంటున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: కరోనా ముప్పు నుంచి రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరూ రెండు డోస్‌ల తరువాత బూస్టర్ డోస్‌ను తప్పనిసరిగా వేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ చైర్మన్‌తో పాలువురు ప్రజాప్రతినిధులు బూస్టర్ డోస్ వేయించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కరోనా బారిన పడిన వారికి ప్రభుత్వం అన్ని రకాల వైద్య సేవలను అందిస్తోందన్నారు. విదేశాల్లో కరోనా విజృంభన మళ్లీ మొదలైందని, కనుక ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. మాస్కులు తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, మార్కెట్‌కమిటీ చైర్మన్ సురేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, నాగేశ్వర్, రవికుమార్, బాలాల, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: విదేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు అర్హత గల అల్ప సంఖ్యాక వర్గాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సుధారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా పోస్టు గ్రాడ్యుయేషన్ కోసం అమెరికా, ఆస్ట్రేలియా, లండన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, సింగపూర్ దేశాల్లో చదివేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2022 ఆగస్టు నుంచి డిసెంబర్ 2022 మధ్యలో అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులు తమ ధ్రువ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలన్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థికి రూ. 20లక్షలు రెండు విడతల్లో అందిస్తారన్నారు. విమాన ఛార్జీలకు రూ.60 వేలు అదనంగా అంటాయన్నారు. విద్యార్థులు ఈనెల 23 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

వికారాబాద్ అర్బన్: రాయితీ రుణాలకు దరఖాస్తు గడువు ఈ నెల 9వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సుధారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు అర్హత గల ముస్లింలు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 73375 34111, 9912144364ను సంప్రదించాలన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

బషీరాబాద్: ప్రభుత్వ సబ్సిడీ రుణాల కోసం ముస్లింలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రమేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ నెల 9లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రేణుకాదేవి

మోమిన్‌పేట: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆమె సందర్శించారు. పాఠశాలల్లో సమస్యలపై ఆరా తీశారు. మధ్యాహ్నభోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. వారంలో కోడిగుడ్లను ఎన్ని సార్లు ఇస్తున్నారంటూ విద్యార్థులను అడిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతి విద్యార్థి తరగతులకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. 'తొలి మెట్టు' పద్ధతిలో బోధించాలని అన్నారు. విద్యార్థులకు చదవడం, రాయడం, తీసివేత, కూడికలు తప్పని సరిగా రావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, ప్రధానోపాధ్యాయులు ప్రభు, మునీరమ్మ, రాములు, ఉపాధ్యాయులు ఉన్నారు.



ఆటోలో ప్రమాదకరస్థితిలో చిన్నారుల ప్రయాణం

ప్రయాణం ప్రమాదకరం చిన్నారులతో చెలగాటం

పసికూనలు ప్రమాదం అంచున ప్రయాణం చేస్తున్నారు. చిన్నారులను ఆటోలో కిక్కిరిసి తీసుకెళ్తుండటం భయాందోళనకు గురిచేస్తోంది. పరిగి పట్టణ కేంద్రంలో నిత్యం ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నా అటు పోలీసులు, ఇటు పాలకులు కిమ్మనకపోవడం గమనార్హం. ఒకే ఆటోలో 20 మందికి పైగా విద్యార్థులను తరలిస్తున్నారు. ఆటో లోపల ఒకరిపై ఒకరిని కూర్చోబెట్టడం.. అటుఇటు నిలబెట్టి ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల ప్రాణాలతో చెలగాట మాడుతున్న ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఆటోలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

– పరిగి



ప్రైవేటు స్కూల్ ఆటోలో కిక్కిరిసి ఉన్న చిన్నారులు

కొలువుపై ఆశ.. చదువుపైనే ధ్యాస

ఏళ్ల తరబడి ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసిన నిరుద్యోగుల్లో ఇప్పుడు ఆశలు చిగురిస్తున్నాయి. ఎలాగైనా కొలువు కొట్టాలన్న పట్టుదలతో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. మరోవైపు శిక్షణ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఆయా శాఖల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేస్తున్న విషయం విదితమే. నోటిఫికేషన్ల జారీతో ఆయా విభాగాల్లో డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవడం ఊపందుకుంది. మరోవైపు ఒకేసారి నోటిఫికేషన్లు వెలువడటంతో దేనిపై దృష్టి సారించాలన్న విషయంలో నిరుద్యోగుల్లో గందరగోళం నెలకొంది.

పోటీ పరీక్షలకు వేళాయె..
- పుస్తకాలతో నిరుద్యోగుల కుస్తీ
- గ్రూప్స్‌పై ప్రత్యేక దృష్టి
- శిక్షణ సెంటర్లకు పరుగులు



అంబేడ్కర్ భవనంలో గ్రూప్స్ శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు

వికారాబాద్ అర్బన్: విద్య, వైద్య, పోలీసు, రెవెన్యూ, సంక్షేమ తదితర శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు టీఎస్‌పీఎస్సీతో పాటు ఇతర శాఖలు సొంతంగా నోటిఫికేషన్లు జారీ చేశాయి. ప్రధానంగా ఉపాధ్యాయ, పోలీసు, గ్రూప్స్ వంటి ఉద్యోగాలపై గంపెడాశలు పెట్టుకొని చదువుతున్నారు. పోలీసు శాఖలో ఇప్పటికే ఈవెంట్స్ పూర్తి కావడంతో మెయిన్స్ రాత పరీక్షల్లో రాణించేందుకు గంటల తరబడి చదువుతున్నారు. ప్రస్తుతం గ్రూప్–4, గ్రూప్–2,తో పాటు జేఎల్, స్టాఫ్ నర్సు వంటి పోస్టులకు అర్హులైన నిరుద్యోగులు సిద్ధమవుతున్నారు.

గ్రూప్–4, 3పైనే దృష్టి

నిరుద్యోగులు ఎక్కువగా డీఎస్సీతో పాటు, జేఎల్, వార్డన్, లైబ్రేరియన్ వంటి పోస్టులతో పాటు, పోలీసు రిక్రూట్‌మెంట్‌పై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం తరచూ ఈ రెండు శాఖల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేస్తోంది. ఈ సారి గ్రూప్స్–2, 3, 4 పోస్టులను భర్తీ చేస్తోంది. వీటి ఖాళీల సంఖ్య ఎక్కువగా ఉండటంతో నిరుద్యోగులు ఎక్కువ వీటిపై దృష్టి సారిస్తున్నారు. వీటితో పాటు రెవెన్యూ, ఆర్‌టీఏ, వైద్య, ట్రాన్స్‌పోర్ట్, విద్యుత్, ఆర్టికల్చర్, అగ్రికల్చర్, డ్రగ్ కంట్రోలర్ వంటి శాఖల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చింది. దీంతో ఏదోఒక దాంట్లో ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో నిరుద్యోగులు శ్రమిస్తున్నారు.

జిల్లాలో ఖాళీలు ఇలా..

ప్రస్తుతం జిల్లాలో 792 పాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో జీహెచ్‌ఎం– 83, ఎల్‌ఎఫ్‌ఎల్–75, ఎంఈఓ–16 ఖాళీగా ఉన్నాయి. ఇవి పదోన్నతులతో వచ్చే పోస్టులు. మిగతా వాటిలో 291ఎస్జీటీలు, ఆయా సబ్జెక్టులకు సంబంధించిన స్కూల్ అసిస్టెంట్ 257, పీఈటీ 14, భాషా పండిట్ పోస్టులు 67 ఉన్నాయి. మొత్తం మీద జిల్లాలో దాదాపు 792కు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో బీఈడీ, డీఎడ్ పూర్తి చేసుకున్న పాత, కొత్త వారితో కలిపి 10వేల మంది వరకు పోటీలో ఉన్నారు. వీరంతా డీఎస్సీ ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు.

అన్నీ ఒకేసారి రావడంతో...

ప్రభుత్వం అన్ని శాఖల నుంచి ఉద్యోగాల ప్రకటన వెలువరిస్తుండటంతో ఉద్యోగులు గందరగోళానికి గురవుతున్నారు. జోనల్ స్థాయిలో ఉండే జేఎల్ వంటి పోస్టులకు కూడా అర్హత ఉన్న వాళ్లు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రూప్స్ నోటిఫికేషన్లు కూడా ఇప్పుడే రావడంతో ఏ పరీక్షకు సిద్ధం కావాలనే సంశయంలో ఉన్నారు. మూడేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం జేపీఎస్ (జూనియర్ పంచాయతీ సెక్రటరీ) పోస్టుల నియామకం కోసం 2018 సెప్టెంబర్లో నోటిఫికేషన్ ఇచ్చింది. అంతకు ముందు వీఆర్‌ఓ, గ్రూప్–4, 2016లో డీఎస్సీ నోటిఫికెషన్లు వచ్చాయి. 2018 తరువాత పెద్దగా నోటిఫికేషన్లు రాలేదు. మూడేళ్ల తరువాత అన్నీ శాఖల నుంచి నోటిఫికేషన్లు వస్తుండటంతో గందరగోళానికి దారి తీస్తోంది. ఏ ఉద్యోగానికి సిద్ధం కావాలనేది తేల్చుకోలేక పోతున్నారు. ముందుగ శిక్షణ తీసుకుంటే ఏదోఒకటి సాధించలేక పోతామా అనే ఉద్దేశంతో మళ్లీ కోచింగ్ సెంటర్ల బాట పడుతున్నారు.

నియామకాలు సైతం చేపట్టాలి



చాలా రోజులుగా ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం నోటిఫికేషన్లతోనే కాలం గడపొద్దు.వెంటవెంటనే ఉద్యోగాల నియామకం చేపడితే నిరుద్యోగులకు మేలు జరుగుతుంది. ఒకేసారి ఎక్కువ నోటిఫి కేషన్లు రావడంతో ప్రిపరేషన్‌కు కొంత ఇబ్బందిగా మారింది. నేను ఎస్ఐకి క్వాలిఫై అయ్యాను. ఏదో ఒకటి సాధించాలని గ్రూప్–4కు కూడా ప్రిపేర్ అవుతున్నాను.

– శ్రీకాంత్, శిక్షణ తీసుకుంటున్న యువకుడు

నోటిఫికేషన్లు రావడంతో..



నోటిఫికేషన్లు వెంటవెంటనే రావడంతో దేనికి సిద్ధం కావాలనే గందరగోళం నెలకొంది. ఒక్కో ఉద్యోగానికి ఒక్కో రకమైన సెలబస్ ఉంటుంది. శిక్షణ కూడా దేనికి తీసుకుంటే మంచిదనే విషయంలో తర్జనభర్జన పడుతున్నాం. ఒక్కో నోటిఫికేషన్‌కు కనీసం ఆరు నెలల సమయం ఇచ్చి, నిరంతరంగా ఉద్యోగాలు భర్తీ చేస్తే బాగుంటుంది.

– సవిత, గ్రూప్–4 శిక్షణ తీసుకుంటున్న యువతి

తేల్చుకోలేక పోతున్నారు



నోటిఫికేషన్లు వస్తున్నా ఇంకా నిరుద్యోగులు తేల్చుకోలేక పోతున్నారు. ఒకేసారి ఇన్ని నోటిఫికేషన్లు ఇవ్వడంతో శిక్షణ కేంద్రాలకు కూడా ఇబ్బంది. ఒక శాఖ తరువాత ఒకటి భర్తీ చేస్తే నిరుద్యోగులు బాగా చదవడానికి అవకాశం ఉంటుంది. అప్పుడే ఏదోఒక ఉద్యోగం సాధిస్తారు.

– బీవీ రమణ, ఏకేఆర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్

విద్యాభివృద్ధికి కృషి

- మంత్రి సబితారెడ్డి
- ఎక్వాయిపల్లిలో పౌర పఠన మందిరం ప్రారంభం

కడ్తాల్: సీఎం కేసీఆర్ ఆదేశాలతో రాష్ట్రంలోని 5 వేల ప్రభుత్వ పాఠశాలల్లో రీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సబితారెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లిలో గురువారం విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఆయాచితం శ్రీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డితో కలిసి పబ్లిక్ రీడింగ్‌రూమ్ (పౌర పఠన మందిరం)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో సర్పంచ్ సుగుణ సాయి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఎక్వాయిపల్లిలో ఏర్పాటు చేసిన పౌర పఠన మందిరం రాష్ట్రంలోనే మొదటిదని, జిల్లాలో మరో 10 ప్రారంభించేందుకు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులతో పాటు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మన ఊరు–మన మనబడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేస్తున్న పాఠశాలల్లో లైబ్రరీ, సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాస్ రూమ్స్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వెనుకబడిన విద్యార్థుల కోసం తొలిమెట్టు ద్వారా 1 నుంచి 5 వతరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన చేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పౌర పఠన మందిరాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్ అన్నారు. కార్యకమంలో డీఈవో సుశీందర్ రావు, డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ మురళీ కృష్ణ, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ దశరథ్ నాయక్ తదితరులు ఉన్నారు.

సైట్ తెరుచుకోదు.. రైతుబంధు అందదు

- కొత్త రైతుల ఆశలపై నీళ్లు
- 35వేల మంది ఎదురుచూపు

బషీరాబాద్: రైతుబంధు పథకం కొత్త రైతుల ఆశలపై నీళ్లుచల్లింది. జిల్లాలో 2,79,724 మంది రైతులు అర్హులుగా ఉన్నారు. ఇందులో గత వానాకాలంలో 2,47,232 మంది రైతులు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం పొందారు. మిగతా 32 వేల మందికి సాయం అందలేదు. వీరితో పాటు 2022 డిసెంబర్ 20 వరకు కొత్తగా జారీ అయిన పాసు పుస్తకాల రైతులు ఈ నెల 7లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం గత డిసెంబర్ మొదటి వారంలోనే ప్రకటించింది. అయితే నేటికీ ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. వారికి సమాధానంచెప్పలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి కూడా దీనిపై ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ యాసంగిలో కూడా జిల్లాలో సుమారు 35 వేల మంది రైతులు రైతుబంధు పొందే అవకాశం లేకుండా పోయింది.

రూ.131.32 కోట్ల సాయం జమ

జిల్లాలో 3 ఎకరాలలోపు ఉన్న రైతుల ఖాతాల్లో యాసంగి పెట్టుబడి సాయం కింద రూ.131.32 కోట్లు జమచేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ తెలిపారు. జిల్లాలో సుమారు 2,79,724 మంది రైతులకు గాను 1,81,337 మంది ఖాతాల్లో గురువారం వరకు నిధులు జమ అయ్యాయి. ఎన్ని ఎకరాలు ఉన్నా అందరికీ విడతల వారీగా రైతుబంధు వస్తుందని అధికారులు చెబుతున్నారు.

8,83,508

జిల్లాలో ఓటర్ల సంఖ్య



- కొత్తగా చేరినవారు: 15,626
- తొలగించిన ఓట్లు: 3,164
- పోలింగ్ స్టేషన్లు : 1,130
- ఓటర్ల తుది జాబితా ప్రకటించిన ఎన్నికల కమిషన్

తాండూరు: జిల్లా ఓటర్ల తుది జాబితా–2023ను ఎన్నికల కమిషన్ గురువారం ప్రకటించింది. ఈ జాబితాలో ఓటర్ల తొలగింపు, కొత్త ఓటర్ల చేరికతో పాటు మొత్తం ఓటర్లు ఎంత మంది ఉన్నారనే వివరాలను పొందుపర్చింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 8,83,508 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. ఇక ఎన్నికలే తరువాయి అనేలా రాజకీయ పార్టీలు సైతం జోరు పెంచాయి. ఆరు నెలలుగా ఓటరు జాబితా ప్రక్షాళన చేపట్టారు. డబుల్ ఓట్లు ఉన్న వారిని తొలగించి కొత్త ఓట్లను నమోదు చేశారు. పలు సార్లు ఓటరు జాబితాను విడుదల చేసింది. అయితే ఈ సారి ఎన్నికల కమిషన్ సీఈఓ తుది జాబితాను విడుదల చేశారు. అందులో డబుల్ ఓటర్లు, మరణించిన వారు 3,164 మందిని తొలగించారు. కొత్తగా 15,626 మందికి ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేశారు. జిల్లాలో మొత్తం 1,130 పోలింగ్ కేంద్రాల పరిధిలో 8,83,508 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. కొడంగల్ అసెంబ్లీలో ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఉన్న కోస్గీ, మద్దూర్ మండలాలను సైతం ఈ జాబితాలో చేర్చారు.

వివరాలు ఇలా..

నియోజకవర్గం	పోలింగ్‌కేంద్రాలు	కొత్త ఓటర్లు	తొలగించిన ఓట్లు	మొత్తం ఓటర్లు
కొడంగల్	275	4,095	2,009	2,15,791
వికారాబాద్	284	3,506	88	2,14,447
తాండూరు	266	3,957	921	2,18,885
పరిగి	305	4,068	846	2,34,385

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పెద్దేముల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాలు.. కొండాపూర్‌కు చెందిన మొగులప్ప(55)రోజు వారి పనుల్లో భాగంగా బయటకు వెళ్లారు. ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో దుగ్గాపూర్ గేటు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో మేకల మృతి



కుక్కల దాడిలో చనిపోయిన మేక

పూడూరు: మేకల మందపై వీధి కుక్కలు దాడి చేసి చంపిన ఘటన మండలంలోని మిట్టకంకల్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు చాకలి మల్లయ్య, అంజయ్య తెలిపిన వివరాలు.. గ్రామంలోని కల్లంలో ఎప్పటిలాగే 12 మేకలను కట్టేసినట్లు తెలిపారు. వీటిపై కుక్కలు దాడి చేసి చంపేశాయని తెలిపారు. దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందని బాధితులు బోరున విలపించారు. సర్పంచ్ శ్యామ్ బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

బీజేపీ నేతకు ముందస్తు బెయిల్

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో మంజూరు చేసిన హైకోర్టు
- అధికార పార్టీ అక్రమ కేసులకు భయపడేది లేదు: మురళీకృష్ణ గౌడ్



తాండూరు టౌన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బీజేపీ నేత, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్‌కు హైకోర్టు ముందస్తు బెయిలు మంజూరు చేసింది. ఇటీవల యాలాలలో ఆయనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్టు చేయకుండా హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నట్లు ఆయన తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిని భయభ్రాంతులకు గురి చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు అక్రమ కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, మోసపూరిత వాగ్దానాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల నాటికి నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేస్తామన్నారు. తాండూరు నియోజకవర్గంలో ఈ సారి బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు రాజ్యాధికారం కల్పించాలి

- రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్
- వికలాంగుల బంధు పథకం ప్రవేశపెట్టాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న గిద్దె రాజేష్

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ నుంచే దివ్యాంగుల రాజ్యాధికార పోరాటం ప్రారంభమవుతుందని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ తెలిపారు. గురువారం ఆ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింలు అధ్యక్షతన అంబేడ్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దె రాజేష్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ భారత రాష్ట్ర సమితి పేరుతో దేశాన్ని ఉద్ధరిస్తానంటూ చెప్పడం మాని దివ్యాంగుల హక్కులపై ముందుగా స్పందించాలన్నారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే వికలాంగులకు రాజ్యాధికారంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ, ప్రతి పక్ష కాంగ్రెస్ పార్టీలతో పాటు, వామపక్ష పార్టీలు వికలాంగుల రాజ్యాధికారంపై స్పందించాలన్నారు. కేవలం ఎన్నికల సమయంలో తమను గుర్తు చేసుకునే రాజకీయ పార్టీల అస్సలు రంగు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా దివ్యాంగులు దుర్భరజీవితాలను గడుపుతున్నట్లు తెలిపారు. చట్టసభల్లో రాజ్యాధికారం కల్పిస్తేనే వివక్షకు దూరమవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ భారత రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడిగా ఒక వికలాంగున్ని నియమించాలని డిమాండ్ చేశారు. దళితబంధు తరహాలోనే వికలాంగుల బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఒక్కో కుటుంబానికి రూ. 15లక్షలు ఇవ్వాలన్నారు. ప్రతి వికలాంగుడికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని, రూ. 600 కోట్లతో సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుధీర్, నాయకులు చెన్నయ్య, వెంకటయ్య, బాలరాజు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చౌడాపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై ప్రసంగించారు. పేదల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పార్టీలో విభేదాలను ప్రోత్సహించరాదని ఎమ్మెల్యే సోదరులు అనిల్‌రెడ్డి సూచించారు. అనంతరం అనిల్‌రెడ్డి, వీరాపూర్ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. పార్టీలో చీలికలు తీసుకురావద్దని సూచించారు. పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రస్థాయి పదవులు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఏ పదవి ఇచ్చినా బాధ్యతగా పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, మండల నాయకులు పాల్గొన్నారు.

మరోసారి మోడీనే ప్రధాని చేద్దాం



సమావేశంలో పాల్గొన్న సినీనటి, నియోజకవర్గ పాలక్ జీవిత రాజశేఖర్

- సినీనటి, నియోజకవర్గ పాలక్ జీవిత రాజశేఖర్
- కలసికట్టుగా పనిచేద్దామని పిలుపు

ధారూరు: రాబోయే కాలంలోనూ నరేంద్రమోడీనే దేశ ప్రధానిని చేద్దామని, ఇందుకు మనమంతా శ్రమిద్దామని సినీనటి, బీజేపీ వికారాబాద్ నియోజకవర్గ పాలక్ జీవిత రాజశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం ధారూరులోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీజేపీ మండల కార్యవర్గ, బూత్ శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మహిళలను బీజేపీలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందుకు తగినట్లు మనమంతా పనిచేద్దామని పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచే పార్టీ బలోపేతం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, నాయకులు నెల్లి విశ్వనాథం, ఎం. రమేశ్, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి జల్సారాయుడు

- ప్రజలకు సేవ చేయడం మరిచి స్కామ్‌లు
- బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేస్తాం
- మాజీ ఎమ్మెల్యే, బీజేపీ తాండూరు అసెంబ్లీ పాలక్ శ్రీనివాస్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు: రోహిత్‌రెడ్డి జల్సారాయుడని.. ఇలాంటి వ్యక్తి ఎమ్మెల్యే కావడం ప్రజల దౌర్భాగ్యమని మహబూబ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ తాండూరు అసెంబ్లీ పాలక్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సదానందరెడ్డి, రమేష్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణ, నాయకులు రమేష్ మహరాజ్‌లు నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో బూత్ స్థాయిలో మహా సమ్మేళన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతి నియోజకవర్గంలో పాలక్‌లను నియమించడం జరిగిందన్నారు. తాండూరు నియోజకవర్గానికి పాలక్‌గా తనను నియమించారన్నారు. తాండూరు నియోజకవర్గంలో 266 బూత్ కమిటీలను పూర్తి చేయడం జరిగిందన్నారు. టీఆర్ఎస్ అవినీతి పాలనను అంతం చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీ టీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్యే ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని. అందుకు డబుల్ ఇంజిన్‌తో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నార పేర్కొన్నారు. తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి స్థానికంగా వ్యతిరేకత పెరిగిందన్నారు. తాండూరులో ప్రజల సేవను మరిచి బెదిరింపులు, స్కామ్‌లు చేస్తున్నారన్నారు. బెంగళూరు డ్రగ్స్ కేసుతో పాటు తవ్విన కొద్ది అవినీతి చిట్టా వెలికివస్తున్నాయని అన్నారు. ఈ సారి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపొందడం ఖాయమన్నారు. ఈ నెల 7న తాండూరు పట్టణంలోని తులసీ గార్డెన్‌లో 7 వేల మందితో బూత్ స్థాయి మహా సమ్మేళన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, కౌన్సిలర్లు అంతారం లలిత, బంటారం లావణ్య, సాహు శ్రీలత, నాయకులు సంగెం హన్మంతు, బంటారం భద్రేశ్వర్, ఆంజనేయులు, సందీప్, మహిపాల్, రమ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో విదేశీ బృందం పర్యటన

గ్రామీణ వైద్య సేవలపై ఆరా



ధారూరు వైద్యులు, సిబ్బందితో అమెరికా వైద్య శిక్షణ బృందం సభ్యులు

ధారూరు: అమెరికాకు చెందిన విస్కిన్ సన్ యూనివర్సిటీ శిక్షణ వైద్య బృందం గురువారం ధారూరులో పర్యటించింది. గ్రామీణ వైద్య విధానంపై వారు అధ్యయనం చేశారు. మొదట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ రోగులకు అందుతున్న వైద్యం, ఉచిత మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. పశువులకు వ్యాపించే వ్యాధులు, కుక్క కాటుకు ఇచ్చే వ్యాక్సిన్ గురించి పశు వైద్యశాల డాక్టర్లను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టర్లతో మాట్లాడారు. ప్రైవేటు వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర సేవలు అందించలేరని, అందుబాటులో ఉన్న ఆర్ఎంపీలనే ఆశ్రయిస్తారని అక్కడి ప్రజలు వారికి వివరించారు. అనంతరం పంటల సాగుపై వారు రైతులతో మాట్లాడారు. కాలానుగుణంగా పండిస్తున్న పంటలు, వాటికి వాడే రసాయనిక మందులు, క్రిమిసంహారక మందుల గురించి, సేంద్రియ వ్యవసాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు సర్పంచ్ చంద్రమౌళితో కలిసి గ్రామంలో పర్యటించి ప్రజలకు పాలకవర్గం అందిస్తున్న సేవల గురించి, ఓటర్లు, జనాభా గురించి అడిగారు. ఈ శిక్షణ బృందంలో డాక్టర్ బాగీష్ మిస్రా, డాక్టర్ అనిత, డాక్టర్ సౌజన్య, డాక్టర్ అనిల్, ఈఎంఈ విఘుశ్వర్, ఏఎఫ్ఈ గౌస్, శిక్షణ వైద్య విద్యార్థులు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీదే అధికారం

- పార్టీ కోసం కష్టపడి పని చేయాలి
- ఎమ్మెల్యే ఈటల రాజేందర్



ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ మండల అధ్యక్షుడు శేఖాపురం ఆంజనేయులు

తాండూరు రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని, తాండూరులో కూడా బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుస్తారని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. గురువారం కర్ణాటక రాష్ట్రం కుంచారం సమీపంలో గల ఓ గ్రామంలో నిర్వహించిన సమావేశానికి ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2023 సాధారణ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీదే అధికారం అని ఆశాభావం వ్యక్తం చేశారు. తాండూరులోనూ తమదే గెలుపన్నారు. కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడి పని చేయాలని సూచించారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని పేర్కొన్నారు. ప్రజలు కేసీఆర్‌ను నమ్మేరోజులు లేవన్నారు. బీజేపీ తాండూరు మండల అధ్యక్షుడు శేఖపురం ఆంజనేయులు, మల్కాపూర్‌కు చెందిన చిరంజీవి.. ఈటలను మర్యాదపూర్వకంగా కలిశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆరోగ్యం బాగు

రెండేళ్ల తర్వాత కుటుంబసభ్యుల చెంతకు



స్వామిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు, పోలీసులు

బడంగ్‌పేట్: రెండేళ్ల క్రితం సంతోష్‌నగర్ ప్రాంతంలో మతిస్థిమితం సరిగ్గాలేని ఓ వ్యక్తి(42)ని మాతృదేవో భవ అనాథ, మానసిక దివ్యాంగుల ఆశ్రమ నిర్వాహకులు చేరదీశారు. అతనికి ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో చికిత్స చేయించారు. రెండేళ్ల తర్వాత అతని ఆరోగ్యం కుదుటపడింది. తన పేరు ముక్కెర స్వామి, మాది హైదరాబాద్‌లోని సైదాబాద్ అని, కుటుంబ సభ్యుల వివరాలు తెలిపాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మతిస్థిమితం లేని ముక్కెర స్వామి ఎక్కడికో వెళ్లి చనిపోయి ఉంటాడని భావించామని, అతని సోదరి, సోదరులు ములగర అండాలు, ముక్కెర రాజేశ్వర్‌రావు, రాజ్‌కుమార్‌లు కన్నీటి పర్యంతమయ్యారు. గురువారం స్వామిని ఆదిబట్ల ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఐ సురేష్‌ల సమక్షంలో ఆశ్రమ నిర్వాహకులు గట్టు గిరి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

కొత్తూరు: లారీ బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన కొత్తూరు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాజేంద్రనగర్ మండలం గగన్‌పహడ్‌లో నివాసం ఉండే మాస రాఘవేందర్(26) నందిగామలోని ప్లాస్టిక్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా గగన్‌పహాడ్ నుంచి బైకుపై మరో కార్మికుడు హరిపద్‌జేనాతో కలిసి బయలుదేరారు. వీరు కొత్తూరు వై జంక్షన్ వద్దకు రాగానే వెనక నుంచి వచ్చిన లారీ అతివేగంతో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాఘవేందర్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మాస విశ్వనాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

తలకొండపల్లి: ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తూ, పాఠశాలల సమస్యలను పరిష్కరిస్తానని పీఆర్‌టీయూ టీఎస్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీఆర్‌టీయూ టీఎస్ తరుపున చెన్నకేశవరెడ్డి బరిలో నిలిచారు. గురువారం తలకొండపల్లి, చుక్కాపూర్, ఖానాపూర్, పడకల్, గట్టుఇప్పలపల్లి, చంద్రధన, వెల్జాల్, రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. 317 జీఓ ఉప సంహరణ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకంపై చర్చిస్తామని వివరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గోవర్దన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, ఆమనగల్లు, కడ్తాల మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, చందర్, పద్మావతి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

గొల్ల చెరువు అభివృద్ధికి కృషి చేస్తాం

- రూ. 5.25కోట్లతో ప్రతిపాదనలు
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్

తాండూరు టౌన్: గొల్ల చెరువు అభివృద్ధికి కృషి చేస్తామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. చెరువులోని వ్యర్థాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు 11 రోజులుగా నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, భారత రాష్ట్ర సమితి పట్టణ అధ్యక్షుడు నయీమ్, నాయకులు నరేందర్ గౌడ్ చెరువును సందర్శించి, మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుర్రపుడెక్క, కలుపు మొక్కలు పెరగడం, మురుగునీరు చెరువులో కలవడం వల్ల చేపల్లో ఎదుగుదల లోపించిందని మత్స్యకారులు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. చెరువులోని వ్యర్థాలను తొలగించడం, తూము మరమ్మతులతో పాటు, వ్యర్థ జలాలు కలవకుండా సైడ్ డ్రైన్ నిర్మించేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమస్యను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని చెప్పారు. ఆందోళన విరమించాలని కోరారు. గతంలో మిషన్ కాకతీయ పథకం కింద గొల్ల చెరువు సుందరీకరణకు రూ. 4.41 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని, తాజాగా చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ. 5.52కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని వారు చెప్పారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేద్దాం



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న అందెల శ్రీరాములు

- అసెంబ్లీ పాలక్ అందెల శ్రీరాములు
- బూత్ కమిటీల నియామకం

కొడంగల్ రూరల్: బీజేపీ బలోపేతానికి క్షేత్రస్థాయి నుంచి కృషి చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ పాలక్ అందెల శ్రీరాములు సూచించారు. గురువారం మండలంలోని చిట్లపల్లిలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కూంద్రు నర్సింలు, కో కన్వీనర్ రాము, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కూర వెంకటయ్య ఆధ్వర్యంలో బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. బూత్ కమిటీల అధ్యక్షులుగా రొయ్యల రాములు, ముత్యాల రమేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా కోశాధికారి పాండురంగ, మండల ప్రధాన కార్యదర్శి కరాటే శ్రీను, ఉపాధ్యక్షుడు రవిశాస్త్రి, నాయకులు రాజు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న మైపాల్

అనంతగిరి: రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం జిల్లా కేంద్రంలో ట్రాన్స్‌పోర్టు రంగం అడ్డా దగ్గర కార్మికులతో మాట్లాడారు. వికారాబాద్‌లో పర్మినెంట్ పార్కింగ్ కోసం స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. రవాణారంగ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్రూంలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబు నాయక్, బాబు, బద్రీనాథ్, శ్రీనివాస్, శంకర్, రాజు, నర్సింహులు, మోయినొద్దీన్, బాబుమియా తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వృద్ధురాలి మృతి



రైలు కింద వృద్ధురాలి మృతదేహం

అనంతగిరి: ఆగి ఉన్న రైలును దాటుతున్న క్రమంలో రైలు ఒక్కసారిగా కదలడంతో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన వికారాబాద్ స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గొట్టిముక్కుల గ్రామానికి చెందిన పాపమ్మ(70) వికారాబాద్‌కు వచ్చింది. నవాబ్‌పేట చించల్‌పేటకు వెళ్లే క్రమంలో ప్లాట్‌ఫాంపై ఆగివున్న రైలు కింద నుంచి దాటుతుండగా ఒక్కసారిగా రైలు కదిలింది. దీంతో రైలు కింద పడి ప్రాణాలు వదిలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్ల విస్తరణ, మరమ్మతులకు నిధులు

ఇబ్రహీంపట్నం రూరల్: నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ, వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం విజయవాడ రహదారి, పీర్లగూడ వద్ద రోడ్డు మరమ్మతులకు రూ. 50లక్షలు, ఘట్కేసర్ నుంచి అనాజ్‌పూర్ మీదుగా తారామతిపేట్ రోడ్డుకు రూ. 103.50లక్షలు, సాగర్ పీడబ్ల్యూడీ రోడ్డు పోచారం వయా ఉప్పరిగూడ రూ. 185లక్షలు, ఎల్మినేడు నుంచి తులేకలాన్ రోడ్డు రూ. 60లక్షలు, మంచాల్ నుంచి ఆగాపల్లి వయా జాపాల్‌కు రూ. 215లక్షలు, ఏపీపీ రోడ్డు నుంచి చెన్నారెడ్డిగూడ రూ. 42లక్షలు, చిత్తాపూర్ నుంచి ఆరుట్ల వరకు రూ. 54లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తులేఖుర్దు వయా చౌదర్‌పల్లికి రూ. 166లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కొత్తపల్లి వరకు రూ. 91లక్షలు చొప్పున మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. అలాగే కల్వర్టుల నిర్మాణానికి రూ. 20కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మరో రూ. 25కోట్లతో ఇప్పటికే సింగిల్ రోడ్లను డబుల్‌గా మార్చనున్నారు. ఇప్పటికే వీటి పనులు ప్రారంభం అయ్యాయి. నియోజకవర్గంలోని రోడ్లన్నింటినీ బాగు చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో పెండింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు దగ్గరుండి పనులు పర్యవేక్షించాలని, అవినీతి అక్రమాలు జరగకుండా చూడాలని తెలిపారు.